

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

శుక్రవారం,12 సెప్టెంబర్ 2025

8 పేజీలు


## టీడీపీ అధ్యక్ష జాబితా ఎప్పుడు ?

# ఏలూరు, పశ్చిమ సారధు లెవ్వరు?










- టీడీపీలో కొత్త టెన్షన్
- లోకేష్‌ని కలిసిన ఆశావాహులు
- సామాజిక సమతుల్యతకే ప్రాధాన్యత
- రేసులో సీనియర్‌లతో పాటు జూనియర్లు !

**ఏలూరు,సూర్య ప్రతినిధి:** రాష్ట్ర టీడీపీ అధిష్టానం ఇప్పటికే స్ధానిక నాయకత్వం వైపు దృష్టి పెట్టింది. సాధ్యమైనంత మేర త్వరలోనే జిల్లా కమిటీలకు పచ్చజెండా ఊపనున్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి అయింది.అన్ని జిల్లాలల్లో సామాజిక సమతుల్యత దృష్టిలోపెట్టుకొనిఆతరువాత జిల్లాఅధ్యక్షుల పేర్లు ఖారారు చేయబోతున్నారు. కాగా ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కొత్త సారధులను ఎంపిక చేస్తారా? పాత వారినే కొనసాగిస్తారా? అనే సస్పెన్సులో క్యాడర్ ఉంది.

**-పోటా పోటీ –** జిల్లా టీడీపీ అధ్యక్షులుగా పగ్గాలు చేపట్టెందుకు ఇప్పటికే సీనియర్‌లతో పాటు, జూనియర్‌లు పోటీ పడుతున్నారు. ఏలూరు జిల్లాకు టీడీపీ అధ్యక్షులుగా గన్ని వీరాంజనేయులు సుదీర్ఘ కాలం కొనసాగారు. ఈమధ్యనే గన్నికి వరుస పదవులు దక్కాయి. డీసీసీబీ చైర్మన్‌గా, ఆప్కాబ్ చైర్మన్‌గా కీలక పదవులు దక్కాయి.అలాగే పశ్చిమ గోదావరిలో మాజీ ఏమ్మెల్యే రామ రాజు జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. ఆయనను ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ నేపద్యంలో తిరిగి జిల్లా అధ్యక్షులుగా కొనసాగెందుకు వీరిద్దరూ ఆసక్తి ప్రదర్శించారు. పశ్చిమ గోదావరికి ఇపుడున్న సామాజిక పరిస్థితిలను బట్టి రామరాజుకే అవకాశం ఇస్తారంటూ విస్తృత ప్రచారం. ఇప్పటికే వివిధ హొదాలలో పదవులు అనుభవిస్తున్న వీరికి టీడీపీ అదినాయకత్వం తిరిగి అప్పగిస్తుందా.. లేక కొత్త వారికి అవకాశం ఇస్తుందా, లేదా అనేది కొద్దీ రోజులోనే తేలిపోనుంది.

**–ఆశావహుల ఆశలు –**అయితే ఏలూరు జిల్లాకు గన్ని వీరాంజనేయులు, పశ్చిమ నుంచి రామరాజుకు అవకాశం ఇవ్వకుంటే తమకు ఛాన్స్ ఇవ్వాలని మరికొందరు చాలా కాలం నుంచి

- తరువాయి 2లో..

## కర్నూలు ఉల్లి ఎంతో రుచికరం

- రైతులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి
- జిల్లా ప్రజలు,విద్యాసంస్థలు కర్నూలు ఉల్లినే వినియోగించాలి




**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** కర్నూలు ఉల్లికి మార్కెట్ పెంపొందించే దిశగా ప్రత్యేకంగా ఉల్లితో తయారుచేసిన వంటకాలతో రైతులు, ట్రేడర్స్‌తో కలిసి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిభోజనం చేశారు. గురువారం ఉల్లి హొల్ సేల్ మార్కెట్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఉల్లి కొనుగోళ్ళను పరిశీలించి ట్రేడర్స్‌తో, రైతులతో మాట్లాడారు. ఈరోజు ఎక్కడ నుండి ఉల్లి లోడ్లు వచ్చాయి, ఎన్ని మెట్రిక్ టన్నులు వచ్చాయి, ధర ఎంత పలుకుతుంది తదితర వివరాలను స్వయంగా అడిగి తెలుసుకుని పరిశీలించారు. కడప నుంచి వచ్చిన రైతు వద్ద రూ. 6లు చొప్పున కొనుగోలు చేసినట్లు తెలుసుకొని రూ. 9 చొప్పున ధర చెల్లించాలని ట్రేడర్ కు చెప్పడంతో వారు అంగీకరించి 9 రూపాయలు చొప్పున చెల్లించడం జరిగింది. ఈ సందర్భంలో రైతు సంతోషాన్ని వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనలతో అన్ని రకాల కూరలు ఉల్లిపాయలతో తయారు చేయించి ఉల్లి మార్కెట్ యార్డ్ నందు రైతులకు, ట్రేడర్స్ కు ఏర్పాటుచేసిన భోజనాలలో జిల్లా కలెక్టర్ పాల్గొని రైతులతో కలిసి ఉల్లి వంటకాలను స్వయంగా రుచిచూశారు. కర్నూలు ఉల్లి వంటకాలు అద్భుతంగా ఉన్నాయని, సోలాపూర్ ఉల్లి కంటే కర్నూలు రుచిగా ఉంటాయన్నారు. వారి ఇంట్లో

- తరువాయి 2లో..

## నేడు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏలూరు పర్యటన



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ శుక్రవారం ఉదయం 11 లకు పోలవరం నియోజకవర్గంలో నేవి ఆయుధ డిపో ఏర్పాటుపై కలెక్టరేట్ లో నేవీ అధికారులతో సమావేశంలో పాల్గొంటారు.

మధ్యహ్నం2 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో జరిగే జిల్లా అభివృద్ధి, సమన్వయ కమిటీ (దిశ) సమావేశంలో పాల్గొంటారు.

## నేడు భీమవరంలో

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సారధ్యం యాత్ర

- భారీగా బిజెపి జెండాలు, ఫ్లెక్సీలతో అలంకరణ చేసిన బిజెపి శ్రేణులు

**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరంలో 12వ తేదీ శుక్రవారం జరిగే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సారధ్యం యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బిజెపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భీమవరంలోసారధ్యం యాత్ర ఏర్పాట్ల పైన జిల్లా బిజెపి కార్యాలయంలో నాయకులతో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ చర్చించి పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి మాధవ్‌జిల్లా పర్యటనకు వస్తున్నం దున పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి ఈ యాత్రను విజయవంతం చేయాలని, ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చూడాలని నాయకులను శ్రీనివాస వర్మ ఆదేశించారు. ఈ




సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినం పూడి శ్రీదేవి, మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు, జిల్లా కోశాధికారి కురెళ్ళ నరసింహారావు, బిజెపి సీనియర్ నాయకులు అల్లూరి సాయి దుర్గరాజు, కాయిత సురేంద్ర, షేక్ మొహద్దిన్‌రాజు,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**– మాధవ్ పర్యటన వివరాలు –**

శుక్రవారం ఉదయం 6:30 నుండి 7:30 వరకు ఎస్‌సిహెచ్‌బిఆర్‌ఎం హైస్కూల్‌లో

- తరువాయి 2లో..

# నేపాల్ తెలుగు పర్యాటకులపై మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

## – ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రశంసలు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారిని రక్షించి స్వస్థలాలకు చేర్చేందుకు రెండు రోజులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన కృషిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. నేపాల్ లో జరుగుతున్న మారణహోమంలో దాదాపు215 మంది తెలుగువారు చిక్కుకుపోయారని తెలియగానే ఒక క్షణం కూడా ఆలస్యం చేయకుండా స్పందించిన మంత్రి నారా లోకేష్ అనంతపురంలో సూపర్ సిక్స్ సభ పర్యటనను కూడా రద్దు చేసుకుని బుధవారం ఉదయం నుంచి సచివాలయంలోనే ఉండి అక్కడి నుంచే కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని నేపాల్‌లో చిక్కుకుపోయిన వారిని తిరిగి తీసుకువచ్చే బాధ్యతను చేపట్టిన తీరు నిజంగా స్ఫూర్తిదాయకమన్నారు. స్నేహితులు కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా విహారయాత్రకు వెళ్లిన వారు కొందరు, దైవదర్శనాలకు వెళ్ళిన వారు కొందరు, ఉద్యోగ ఉపాధి వ్యాపార నిమిత్తం వెళ్ళి అక్కడ ఆకస్మికంగా మొదలైన హింసాత్మక అల్లర్ల కారణంగా హోటళ్లలో, బస్టాండ్లలో, ఆలయ ప్రాంతాల్లో చిక్కుకుపోయి ఆందోళనకు గురవుతున్న తెలుగువారితో ఫోన్ లో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పడం, నేపాల్ కు ప్రత్యేక విమానం పంపడం, ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి పర్యవేక్షించడం నిజంగా ఎంతో అభినందనీయమన్నారు .కాట్మండు భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్: 977-980 860 2881, 977-981 032 6134 ఆంధ్రప్రదేశ్ వారి కోసం ఢిల్లీ ఏపీ భవన్ నంబర్లు: 98183 95787,85000 27678 ఏపీఎన్ఆర్ఎస్ 0863 2340678 ఈమెయిల్ఐడీలు: helpline@apnrts.com, info@ apnrts.com.

# జడ్‌పి చైర్మన్‌తో నూతన పర్యవేక్షక ఇంజనీర్ రమేష్ భేటీ



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు .పంచాయతీ రాజ్ విభాగం ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. పనుల నాణ్యత, వేగం, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని చైర్‌పర్సన్ సూచించారు.

# కాకినాడ కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** కాకినాడ కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ 48వ వార్షిక జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈకమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుంది. అధ్యక్షులుగా అశోక ఇంటర్నేషనల్ అధినేత మండవ సత్యనారాయణ ఎన్నికయ్యారు. రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ పూర్వ అధ్యక్షులుగా సేవలందించడమే అసోసియేషన్‌కి గత 17 సంవత్సరాలుగా అధ్యక్ష బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి అందరి చేత మన్ననలు పొందిన మండవ సత్యనారాయణ తిరిగి అధ్యక్షులుగా ఎన్నిక య్యారు. కార్యదర్శిగా శ్రీరామ్ భగవతి, ఉపాధ్యక్షులుగా ఏ.వి.చలం, సంయుక్త కార్యదర్శిగా ఆర్.శేషగిరిరావు, కోశాధికారిగా బి.రవి, కార్యవర్గ సభ్యులుగా సి.నరసింహారావు, మురళీకృష్ణ, రమణ, నగేష్, పి.వి.రావు, కుమార్‌లు ఎన్నికయ్యారు. కాకినాడ పోర్ట్ నుండి జరిగే ఎగుమతులు మరియు దిగుమతులు ఈ సంఘానికి చెందిన సభ్యులు ద్వారా నిర్వహించబడుతుంది. ఫెడరేషన్ ఆఫ్ ఫ్రైట్ ఫార్వర్డ్ అసోసియేషన్ ఇన్ ఇండియా జాతీయ సంఘానికి దేశవ్యాప్తంగా 31 సంఘాలతో ఎపెక్స్ బాడీతో పనిచేస్తూ ఉంటుంది. అందులో కాకినాడ అసోసియేషన్‌కి చెందిన అధ్యక్షులు మండవ సత్యనారాయణ, కార్యదర్శి శ్రీరామ భగవతి, ఉపాధ్యక్షులు ఏ.వి.చలంలు కార్యవర్గ సభ్యులుగా జాతీయ కమిటీలో కొనసాగుతారు.

# బాల్య వివాహాలు నిరోధించడానికి సమిష్టిగా కృషి





## – ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికారి కె.రత్నప్రసాద్ పిలుపు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనము నందు, గురువారం బాల్యవివాహాలు వల్ల కలిగే నష్టాలు,పనిచేసే ప్రదేశాలలో మహిళలపై జరిగే లైంగిక వేధింపులు నివారణ చట్టాల పైన అవగాహన కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వివిధ కమ్యూనిటీ పరిధిలో సన్నిహితంగా పనిచేస్తూ ఉంటారని,ప్రతి గ్రామంలో బాల్యవివాహాలను నిరోధించడానికి తమవంతు కృషి చేయాలని అన్నారు. అటువంటి సంఘటనలు ఎదురైన సంబంధిత అధికారులకు గాని లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కాని తెలియ చేయాలని సూచించారు.

జిల్లా పరిధిలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన పోష్ కమిటీ ఉంటుందని, పోషక కమిటీ లేని కార్యాలయాల వరకు సంబంధించిన ఉద్యోగినులు సదరు ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు.

లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలపై జరిగే లైంగిక వేధింపులను ఎదుర్కోవటానికి న్యాయసహాయం ఉచితంగా పొందవచ్చును సూచించారు. ఈకార్యక్రమంలో ట్రైనీ మాస్టర్ పి.రత్నరాజు, ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పి.డి ఏ.శారద, డి.సి.పి.ఓ.డా.సి.హెచ్. సూర్య చక్రవేణి,సి.డి.పి.వోలు తులసి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ అధ్యక్ష జాబితా ఎప్పుడు ? ఏలూరు, పశ్చిమ సారధు లెవ్వరు?

మొదటిపేజి తరువాయి

డిమాండ్ చేస్తున్నారు. ఏలూరు జిల్లా నుంచి ఏమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఏమ్మెల్యే గంటామురళి రామకృష్ణ పేర్లు ప్రముఖమంగా వినపడుతున్నాయి.

సామజిక సమతుల్యం మేరకు తుది నిర్ణయం తీసుకొనే అవకాశంఉంది. పొరుగు జిల్లా లో ఉన్న పరిస్థితు లను బట్టి సామాజిక వర్గాలు వారీగా ఎంపిక జరుగు తుందని ఇప్పటికే సీనియర్లు అంచనా కు వచ్చారు.వీరితో పాటు దాసరి శ్యాంచంద్ర శేషు, శీలం వెంకటేశ్వర రావు, జయ్యావరపు శ్రీరామమూర్తి,కొక్కిరిగడ్డ జయరాజు కూడా అధ్యక్ష పగ్గాలు ఆశించే వారిలో ఉన్నారు. వైశ్య సామాజిక వర్గం నుంచి తనకు ఛాన్స్ ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి జయ్యావరపు శ్రీరామ మూర్తి కోరుతున్నారు.

బిసీల కోటాలో తమ పేర్లు పరిగణలోకి తీసుకోవాలని దాసరి శ్యాంచంద్ర శేషు,శీలం వెంకటేశ్వరరావు కోరుతున్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మంతెన రామరాజుతో పాటు భీమవరంకు చెందిన కోళ్ల నాగేశ్వరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు మెంటే పార్ధ సారధి పేర్లు ప్రధానం గా ప్రస్తావనకు వచ్చాయి.పరిశీలకులకు కూడా తమ అభిప్రాయాల్లోవీరి పేర్లనే ఎక్కువ మంది ప్రస్థావించారు. ఇక్కడ సిట్టింగ్ ఏమ్మెల్యేలంతా తమ అభిప్రాయాలూ అధిష్టానం దూతలకు తెలియ చేసినందున అందరిని కలుపుకు పోయే నేత కే నాయకత్వం అప్పగిస్తారని భావిస్తున్నారు.

**– జాబితా ఎప్పుడు ?** –జిల్లా అధ్యక్షులు జాబితా ఎప్పుడు విడుదల చేస్తారు,ఏపే జిల్లా కు ఎవరెవరు నియమితులు కానున్నారు అనే టెన్షన్ పార్టీ వర్గాలో ఉంది వీలయితే అసెంబ్లీ సమావేశాలు లోపే జాబితా వెలువడుతుందా?అంటూ ఇప్పటికే పార్టీ లో ప్రచారం సాగుతోంది. లేదా దసరా లోపు ఖాయం అంటున్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని ఇప్పటికే ఆశవాహులు కొందరు కలిశారు. జిల్లా కు చెందిన రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్ధసారధి అభిప్రాయాలూ కూడా పరిగణలోకి తీసుకుంటారని భావిస్తూ ఇంకొందరు వారిని కలిసి తమ అభ్యర్ధన వారి ముందుంచారు.

# కర్నూలు ఉల్లి ఎంతో రుచికరం

మొదటిపేజి తరువాయి

కూడా కర్నూలు ఉల్లినే వినియోగిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ప్రజలు నిత్య వినియోగానికి, వేడుకలకు, విద్యాసంస్థలు హాస్టల్స్‌లో కర్నూలు ఉల్లినే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. రిలయన్స్, డీమార్ట్ వంటి మెగా మార్ట్స్‌లో కర్నూలు ఉల్లి అమ్మకాలకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంలో మార్కెటింగ్‌శాఖ రీజనల్‌జాయింట్‌డైరెక్టర్ కె.శ్రీనివాస రావు, జిల్లా మార్కెట్ యార్డ్ ఏడి ఎం.సునీల్ కుమార్,తాహసిల్దార్ కె.సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, నంద్యాల కృష్ణమూర్తి,కొట్టుఅంజిబాబురైతులు, హోల్సేల్‌వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు భీమవరంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సారధ్యం యాత్ర

మొదటిపేజి తరువాయి

జరుగుతున్న సంఘ్‌శాఖలో పాల్గొంటారు. ఉదయం 7:45 నుండి 8:45 వరకు డిఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్లో ఛాయ్‌పై చర్చఉదయం 8:50 నుండి 9 వరకు యూత్ క్లబ్‌లో పత్రిక విలేకరుల సమావేశం ఉదయం 9.30 గంటలకు స్వాతంత్ర సమరయోధులుఅల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసే కార్యక్రమం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాల యం వద్ద నుండి వెంకట్రామ థియేటర్ రోడ్డు, ప్రకాశం చౌక్, నటరాజ్ థియేటర్ మీదుగా ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్ వరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే బిజెపి కార్యకర్తలు, నాయకులతో పాద యాత్రగా భారీ శోభాయాత్ర ఉదయం 11గంటలకు ఆనంద ఫంక్షన్ హాల్లో భారతీయ జనతా పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం లో పాల్గొంటారు.

# మహిళల భద్రత, సైబర్ నేరాల పై అవగాహన : సీఐ రామకృష్ణ



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** నూజివీడు డీఎస్పీ కె వివి ఎన్ వి ప్రసాద్ ఆదేశాల మేరకు, నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ తమ సిబ్బందితో కలిసి మండల కేంద్రమైన ఆగిరిపల్లి శివారు లోని,ఎస్.ఎఫ్.ఎస్ పాఠశాలలో గురువారం మహిళల భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత పై నూజివీడు మండల రూరల్ సీఐ కె.రామకృష్ణ విస్తృతమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలు (క్రైమ్ అగైనెస్ట్ విమెన్), సైబర్ నేరాలు,డయల్ 112 అత్యవసర సేవ గురించి విద్యార్థులు వివరించారు.మహిళలు తమను తాము రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్ బ్యాడ్ టచింగ్, హింస, వేధింపులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఆన్ లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, వ్యక్తిగత సమాచారం దొంగిలించడం వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు.రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని,అత్యవసర సమయాలలో ప్రజలు డయల్ 112 కు ఫోన్ చేసి తక్షణ పోలీసు సహాయాన్ని పొందవచ్చని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శుభశేకర్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు ముఖ్యంగా యువతలో నేరాల పట్ల, భద్రత పట్ల అవగాహన పెంచడానికి ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 14న కొయ్యలగూడెంలో స్త్రీ శక్తి బహిరంగ సభ



– విజయవంతం చేయాలని నేతలు,అధికారుల పిలుపు

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్** : కొయ్యలగూడెంలో ఈ నెల 14న జరగబోయే స్త్రీ శక్తి పథకం బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించేందుకు జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నిఖిల్ మధు చరణ్, తాసిల్దార్ ఉదయ్, ఏపిఎం శ్రీనివాస్, ఏపీవో జాన్ వెస్లీ, పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక నాయకులు ప్రతినిధులు కూడా హాజరై తమ సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు వంద శాతం అమలు జరిగాయని మహిళలు పొందుతున్నారని సభలో మహిళలు పాల్గొనడంకోసం గ్రామాల వారీగా మొబిలైజేషన్ ప్లాన్, వాహనాల ఏర్పాటు, ప్రచార కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు.

సమన్వయంతో పనిచేసి జీలుగుమిల్లి మండలం నుండి గరిష్టంగా మహిళలు పాల్గొనేలా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, ఎంపిటీసీ నాలి శ్రీనివాస్ యాదవ్,చిర్రి శ్రీనివాస్, గారపాటి శ్రీను, పాలోజీ దుర్గాప్రసాద్, మండలంలోని వివిధ శాఖల అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మండల వైసిపి అధ్యక్షుడు రాజేష్ జన్మదిన వేడుకలు



**కుక్కునూర్,మేజర్ న్యూస్:** కుక్కునూరు మండలం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ నా జన్మదిన కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి వేలాది సంఖ్యలో వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు అభిమానులకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అలాగే నాకు మండల అధ్యక్ష పదవి ఇచ్చిన దగ్గర నుండి జిల్లా పార్టీ నాయకులు,పోలవరం మాజి శాసనసభ్యులు తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం వచ్చిన ఆ కార్యక్రమాలు అన్నిటిని విజయవంతం చేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని,ఎటువంటి భేదం లేకుండా నా వంతు బాధ్యతగా అందరికీ సహకరిస్తానని అలాగే పార్టీ కోసం కృషి చేస్తానని వారన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కళాశాలలో మిషన్ శక్తి



– పాల్గొన్న కళాశాల విద్యార్థినిలు,అంగన్వాడీ టీచర్లు

**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్** : తాడేపల్లిగూడెం డి ఆర్ గోయెంక ఉమెన్స్ కాలేజ్ నందు మిషన్ శక్తి లో భాగంగా కాలేజ్ స్టూడెంట్స్ కి మరియు మూడు మండలాల అంగన్వాడీ టీచర్స్ కి అవేర్నెస్ మీటింగ్ కండక్ట్ చేయడమైనది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రియల్ సరస్వతి మాట్లాడుతూ ఇది మిషన్ శక్తిలో భాగంగా 2వ తేదీ నుంచి 10వ తారీకు వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన్నట్లు దాన్లో భాగంగానే మిషన్ శక్తి అంటే ఉమెన్ ఎంపవర్మెంట్ అని మిషన్ వాత్సల్య అంటే చిల్డ్రన్ డెవలప్మెంట్ అని తెలియజేశారు. ఈ మిషన్ శక్తి స్కీమ్ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పథకం అని,మిషన్ శక్తిలో భాగంగా వన్ స్టాప్ సెంటర్స్ పనిచేస్తాయని దానిలో స్త్రీలకు ఆరు రకాల సేవలను అందిస్తారని సిడిపిఓ తెలియజేశారు. ప్రజ్వల హోం మిషన్ కోఆర్డినేటర్ శ్రీ శ్రావ్య హాజరై స్త్రీల చట్టాల గురించి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియజేశారు. ప్రదం కోఆర్డినేటర్ వెంకట్ అంగన్వాడి ప్రీస్కూల్ యొక్క ప్రాముఖ్యతను వివరించి ప్రదం నుంచి వచ్చే మెసేజ్ ద్వారా అంగన్వాడి ప్రీస్కూల్ నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ప్రదం కోఆర్డినేటర్ వెంకట్,డిఆర్ గోయెంక కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీ గణపతి రామ్, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సిహెచ్ దుర్గ భవాని,విశాలాక్షి, సుజాత జిజిబి విజయలక్ష్మి, శ్రీదేవి, ఎస్తేర్ రాణి,చంద్రావతి అంగన్వాడీ టీచర్స్ కాలేజ్ స్టూడెంట్స్ హాజరైనారు.

## 16న పాలకొల్లు లో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభం



– చైర్మన్ చైతన్య రాజు, ఎండి, ఎంఎల్సి కె రవి వర్మ వెల్లడి

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** ఈనెల 16 వ తేదీన పాలకొల్లు – భీమవరం పిపి రోడ్ లో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి చైర్మన్ చైతన్య రాజు, ఎండి, ఎంఎల్సి కె రవి వర్మ లు తెలిపారు. బుధవారం వారు ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అమలాపురం కేంద్రంగా ప్రధాన ఆసుపత్రి ఉందని ఇంకా కోనసీమ జిల్లాలో 20 చోట్ల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. ప.గో. జిల్లా కూడా తన భార్య, కోడలు సొంత గ్రామాలు కావడంతో పాలకొల్లులో 100 బెడ్ ఆధునిక సౌకర్యాలతో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్డియాలజీ,న్యూరాలజీ, నెఫ్రాలజీ, డయాలిసిస్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి ప్రత్యేక స్పెషలిస్ట్ లతో పని చేస్తుందని చెప్పారు. ఈ ప్రాంతంలో అత్యవసర గుండె చికిత్స కోసం ఇంతవరకు విజయవాడ, రాజమండ్రి, అమలాపురం వెళుతున్నారని ఇక పాలకొల్లులోనే ఆ సౌకర్యం ఉంటుందని చెప్పారు. ఇంకా ఛాంబర్ కళాశాల కార్యదర్శి కెవి సీతారామరాజు వైద్యులు పాల్గొన్నారు.

## ఛాంబర్స్ కళాశాల కు ఐ ఎస్ ఓ గుర్తింపు



**పాలకొల్లు, మేజర్ న్యూస్** : స్థానిక బిఆర్ఆర్,జికె ఆర్ చాంబర్స్ డిగ్రీ ,పీజీ కళాశాలకు అంతర్జాతీయ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఐ ఎస్ ఓ)గుర్తింపు లభించినదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు. కళాశాలలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన,ఆన్లైన్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జింగ్ కోర్సులు,ఆధునిక కంప్యూటర్ ల్యాబ్స్, అధ్యాపకుల ఆధునిక విద్యాబోధన వారి అర్హతలు ,అనుభవం, కళాశాలలో విద్యార్థుల సర్వతో అభివృద్ధి,సకల సదుపాయాలు కల్పన ప్రాతిపదికపై ఇచ్చిన ఈ గుర్తింపు పాలకొల్లు బి.ఆర్.ఆర్, జి.కె.ఆర్ చాంబర్స్ కళాశాలకు లభించినదని ఐఎస్ఓ సర్టిఫికేషన్ కన్సల్టేషన్ సంస్థ అయిన ఎస్‌బి వి కన్సల్టెన్సీ ప్రతినిధి కే.రామలక్ష్మి అన్నారు. తదుపరి ఆమె కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు , కళాశాల సెక్రటరీ కేవీ సీతారామరాజు సర్టిఫికెట్ ను తీసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు, సెక్రటరీ కేవీ సీతారామరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎన్ఐఆర్ఎఫ్,ఎన్ఎసిసి గుర్తింపునకు కళాశాల కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను,కళాశాల అకాడమిక్ అడ్వైజర్స్ ఏబిఎస్ మూర్తి ,ఎన్ సీతారామారావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన



**కుక్కునూర్,మేజర్ న్యూస్** : కుక్కునూరు లోని ఎస్టీ హైస్కూల్ విద్యార్థులకు మహిళల రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని సైబర్ మోసగాళ్లు ఎన్నో రకాలుగా మోసాలు చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారని ఆ మోసాలను నమ్మొద్దని మహిళలకు రక్షణ కల్పించడంలో మా పోలీసులము ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని వారన్నారు

ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోలీస్ సిబ్బంది హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

# భూ ఉద్యమంలో ఆధిపత్య పోరు 'ఢీ అంటే ఢీ '





**– స్థానిక గిరిజనుల,నిర్వాసిత గిరిజనుల మధ్య అగాధం**
**– ఈ పోరు ఎటు దారి తీసేను ? – అధికారులు మేలుకోకపోతే రణరంగమే !**

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్** : ఏజెన్సీ మండలమైన జీలుగుమిల్లి మండలంలో భూ ఉద్యమాలు రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో కాక పుట్టిస్తున్నాయి. 'ఢీ అంటే ఢీ' అంటూ రెండు వర్గాల గిరిజనులు కత్తులు కర్రలతో దాడికి ప్రతి దాడి అంటూ సై అంటే సై అని కాక పుట్టిస్తున్నాయి. ఒక వర్గం స్థానిక గిరిజనలైతే, మరొక వర్గం నిర్వాసిత గిరిజనులు స్థానిక గిరిజనులు. ఈ రెండు వర్గాల మధ్య గత మూడు సంవత్సరాలుగా పంటలను దున్నేయడం, కోతకొచ్చిన పంటను కోసుకువెళ్లడం ఎదురుపడితే నువ్వెంత నువ్వెంత అంటూ భూ ఉద్యమం పైన పోరు వచ్చారు. నేడు ఆ భూ ఉద్యమం కాస్త తారస్థాయికి చేరుకుంది. అధికారులు స్పందించి మేలుకోకపోతే పరిస్థితి మరో విధంగా ఉంటుందంటూ స్థానికులు గుసగుసలాడుతున్నారు. మండలంలోని పి నారాయణపురం రెవెన్యూ పరిధిలోని 500 ఎకరాల భూమిపై గత కొన్ని ఏళ్లుగా రెండు వర్గాల గిరిజనుల మధ్య భూ వివాదం నెలకొంది. భూములు పై తమకే హక్కులున్నాయి అని ఒకరు. భూములను అధికారులు తమకే ఇచ్చారు అంటూ మరొకరు మాటలతో దాడి ప్రతి దాడి చేస్తూ ఉంటాయి. ప్రతి ఏడు ఈ భూములపై భూద్యమకారులు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే ఇరు వర్గాల గిరిజనలు భూమిపై తమ పట్టు కోసం ఉద్యమం చేయడం దానిని పోలీస్ అధికారులు చల్లార్చడం షరా మామూలుగా జరుగుతుంది. కానీ ఈ ఏడాది ఇరు వర్గాల ప్రతినిధుల ఆధిపత్య పోరు నువ్వెంత నువ్వెంత సై అంటే సై అనే స్థాయికి చేరుకోవడంతో రెండు వర్గాలలో ఉన్న గిరిజనులు అదే స్థాయికి చేరుకున్నారు. ఆయా వర్గాలలోని నాయకులు తమ ప్రాబల్యం కోసం పోటాపోటీగా మీడియా సమావేశాలు నిర్వహించి తమకున్న హక్కులను వెల్లడించే పేరుతో పరస్పర గర్జనలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకరు భూమిని కౌలికిచ్చి లక్షల దోస్తుతున్నారని, మరొకరు అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని పరస్పర ఆరోపణ చేయటం స్థానికులకు అయోమయానికి గురిచేస్తుంది. ఇరువర్గాల గిరిజనుల మధ్య వందలాది గిరిజనులు పరస్పరం ఉండి దాడులు చేసే స్థాయికి వచ్చినా అధికారులు మాత్రం స్తబ్దతగా ఉండడంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు మౌనం వహించడంపై ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు అంటున్నారు స్థానికులు. ఏది ఏమైనా ఉన్నత అధికారులు స్పందించి పి నారాయణపురం రెవిన్యూ పరిధిలో గిరిజనుల మధ్య రచ్చ రేపుతున్న భూ సమస్యను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఇరువర్గాల మధ్య గిరిజనులు ఉద్యమ పోరు రణరంగంగా మారి మరో రూపం దాల్చుతుంది అనడంలో ఆశ్చర్యం లేదు అంటున్నారు రైతులు స్థానికులు. అధికారుల తీరు మార్చుకుని సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

# ఉపాధి చట్టాన్ని అమలు చేయించుకోవాలసిన బాధ్యత కూలీలదే



**– వ్యవసాయ కార్మిక సంఘం నేతలు**

**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టం గా అమలు చేయించు కోవాల్సిన బాధ్యత ఉపాధి కూలీల దేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నరసాపురం మండల రెండవ మహాసభ గురువారం లక్ష్మణే శ్వరం గోపురం వద్ద జరిగింది. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా తిరుమాని సత్యనారాయణ,గుత్తుల లక్ష్మి వ్యవహరించారు. ముందుగా మహాసభ ప్రారంభ సూచకగా సంఘ పతాకాన్ని దొంగ భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ మహాసభలో సత్యనారాయణ,పెద్దిరాజులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎటువంటి వ్యవసాయ పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని,ఈ తరుణంలో ఉపాధి పనులు చూపించడం సరైనది అన్నారు. ఈ మహాసభలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జల్లి రామ్మోహన్ రావు,సిఐటియు జిల్లా నాయకులు ఎం.త్రిమూర్తులు,మహిళా సంఘం నాయకులు కౌరు లక్ష్మి,కౌలు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పి కామేశ్వరరావు, కౌరు శ్రీనివాస్లు మాట్లాడారు. అనంతరం నూతన మండల అధ్యక్ష కార్యదర్శులు గా పోతా బత్తుల మణి కుమారి, గుబ్బల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గుత్తుల లక్ష్మి,పిట్టా రాంబాబు,సహాయ కార్యదర్శిగా కట్టా మహాలక్ష్మి మరో 11 మందితో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# గ్రామాల్లో పూర్తిస్థాయిలో సిసి రోడ్ల నిర్మాణం





**– ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్**

**ముదినేపల్లి ,మేజర్‌న్యూస్** : గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్ల నిర్మాణమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు.ముదినేపల్లి మండలంలో ప్రొద్దువాక,దేవపూడి , వణుదుర్రు గ్రామాల్లోనిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఎన్నికల హామీలు నిలబెట్టుకున్న ఎన్‌డిఏ అన్ని వర్గాలో ప్రజాధరణ పెరుగుతుందన్నారు.సంక్షేమం,అభివృద్ధిపైనే ప్రభుత్వం దృష్టించిందన్నా రు. ఈ కార్యక్రమాల్లో తాహసిల్దార్ ఎస్.కె లతీఫ్ పాషా సర్పంచులు దేవపూడి దాసరి కాశీ అన్నపూర్ణ , ప్రొద్దువాక సింగనపల్లి రామకృష్ణ , వణుదుర్రు చిన్నం సుగుణబాబు, మండల టిడిపి అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి,జనసేన మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకయ్య ,ఎఎన్‌బాబు,శ్రీహరిపురం సర్పంచ్ పరసావిశ్వేశ్వరరావు,బొంగు రవికుమార్ ,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ 'లంకా 'కు శుభాకాంక్షలు



**తిరుమల,మేజర్ న్యూస్:** నూతనంగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణను ఆయన నివాసంలో కలిసి దుస్సాలువ కప్పి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందించి శుభాకాంక్షలు తెలియజేసిన గోపాలపురం ఎయిమ్‌సి చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు,ద్వారక తిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, యమ్ పి డి ఓ ప్రకాష్ ,పంచాయతీ రాజ్ ఎ ఇ వెంకటేశ్వర రావు,మండలం లోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,పార్టీ నాయకులు నాదెళ్ల వేణు,నాదెళ్ల వెంకటేశ్వరరావు,పాతూరి సహృదయ, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రలో ముగిసిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్** : మండలంలోని సీతారాంపురం లో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో "ఉత్కర్ష 2025 జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ 24 గంటల హ్యాకతాన్ నిర్వహించారు. దీనిలో నాలుగు రాష్ట్రాలు ( ఒరిస్సా, మహారాష్ట్ర,తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్) నుంచి 113 బృందాలలో 435 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ లో భాగంగా హ్యాకతాన్ బహుమతిగా 75వేలు,టెక్నికల్, నాన్ టెక్నికల్ బహుమతిగా 90వేలు అందజేశారు. ఈ హ్యాకతాన్ కార్యక్రమం బుధవారం 10 గంటల నుంచి గురువారం 10 గంటల వరకు మూడు కేంద్రాలు 12 మంది కళాశాల అధ్యాపకులు,ఇండస్ట్రియల్ నుంచి న్యాయ నిర్ణేతలు ద్వారా నిర్వహించారు. ఐటీ అండ్ డిఎస్ డిఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొండవీటి బాలరాజు సీఈవో అండ్ కో ఫౌండర్, బోద్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీస్ఈ కార్యక్రమం ఐటీ డిపార్ట్మెంట్ హెచ్ఓడిఆర్ వివిఎస్‌వి ప్రసాద్,టెక్నికల్ ఫెస్ట్ కన్వీనర్ ఆర్ ఉమారుణా దేవి,కో కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్,హ్యాకతాన్ కోఆర్డినేటర్ కే రాజా,కో కోఆర్డినేటర్ సి హెచ్ ఆర్ కే రాజు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి.సత్యనారాయణ,కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ గోపీచంద్ వివిధ విభాగాధిపతులు ,టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



**కొయ్యలగూడెం రూరల్ ,మేజర్‌న్యూస్** : అటవీ సంరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసువులు బాసిన అమర వీరులను స్మరించు కుంటూ మనమిచ్చే నివాళులే వీరులకు ఇచ్చేగౌరవం అని డి.ఆర్.వో,.జె. ప్రభాకర్ అన్నారు. కన్నాపురం అటవీ క్షేత్రాలయం నందు అమరవీరులను స్మరించుకుంటూ అమరవీరుల దినోత్సవని ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బందితో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడటంలో స్మగ్లర్ ఎదిరించి ఉద్యోగని అంతఃకరణ శుద్ధితో బాధ్యతలను నిర్వర్తించి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన వీరులకు జోహార్లు అర్పిస్తూ ఇదే మా నివాళులు అని అన్నారు. అనంతరం స్థానిక లీనా. హాస్పటల్ నందు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎఫ్.ఎస్.ఓ.లు బి. దినేష్ కరీం, పోసరావు,కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పటిష్టంగా ఎస్‌సి,ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం అమలు



**– ప్రతి నెల 30న పౌరహక్కుల దినం జరపాలి**

**ఏలూరు,మేజర్‌న్యూస్** : ఏలూరు ఎస్‌ఆర్పిఎస్ రాష్ట్ర కార్యాలయంలో 1989 ఎస్ సి, ఎస్ టి. అత్యాచారాల నిరోధక చట్టం అమలు జరిగి 35సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యాంగ ధర్మ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ ఎన్‌ఏడి పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ సామాజిక వర్గాన్ని చిన్న చూపుతో చూస్తూ వాళ్ల పట్ల కుల వివక్షత ని కొనసాగిస్తున్న నేటి సమాజంలో వాళ్లకే ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అంటరానితనం నేరమని రాజ్యాంగంలోని ఆర్టికల్ 17న ఆధారంగా చేసుకుని 1955 పౌర హక్కుల రక్షణ చట్టం తీసుకొచ్చి అదేవిధంగా 1976 పౌర హక్కుల పరిరక్షణ ఆనాటి కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. అయినప్పటికీ ఎస్సీల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉన్నదనే ఉద్దేశంతో 1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ దేశవ్యాప్తంగా 1989 సెప్టెంబర్ 11వ తారీఖున రాష్ట్రపతి ఆమోదముద్రం వేసి అమల్లోకి తీసుకురావడం జరిగింది. ఈ చట్టాన్ని కొంతమంది వాళ్ల స్వార్థం కోసం దుర్వినియోగం పరుస్తున్నారనే వాస్తవాన్ని అందరం గ్రహించాలని సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ప్రతి నెల 30వ తారీఖున పౌరుహక్కుల దినం అమలు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ రెవెన్యూ పోలీస్ డిపార్ట్మెంట్లకు బాధ్యత అప్ప చెప్పడం జరిగింది కానీ ఈ డిపార్ట్మెంట్లు నీటిలో బుడగలాగానే ఉన్నాయి తప్ప మనస్ఫూర్తితోఈకార్యక్రమాలను నిర్వహించటలేదని సంతోష్ ఆరోపించారు. ముఖ్య అతిథి డాక్టర్.ఎన్ఏడి పాల్ మాట్లాడుతూ చాలామంది ఈ చట్టం పట్ల అవగాహన లేక దుర్వినియోగం చేస్తున్న వ్యక్తుల్ని ప్రశ్నించలేని పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. కంచె కాపలాకాసే వాళ్లే ఆ కంచెనే తీసేసి విధంగా చట్టాన్ని కాపాడవలసిన వాళ్లే చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, దానికి ఏమాత్రం సంకోచించవలసిన టువంటి అవసరం లేదని తెలియ జేశారు ఈదేశంలో ఈచట్టం పట్ల ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని చేశారని, దయచేసి చట్టాన్ని దుర్వినియోగం చేయడానికి ఎవరు ప్రయత్నం చేయొద్దని డా.పాల్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలుకలు నివసించే కలుగులు పూడ్చివేత



**నరసాపురంరూరల్, మేజర్ న్యూస్** : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం గురువారం చేపట్టారు. దీనిలో భాగంగా ఎలుకలు నివసించే బొరియలను రైతులతో పూడ్చి పెట్టించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా పంపిణీ చేయబడుతున్న బ్రోమోడైలిన్ 0.25 సీబీ మందును గ్రామపంచాయతీ వారి సహకారంతో నూకలు,నూనె కలిపించి విషపు ఎరను మండలంలోని అందరి రైతులకు పంపిణీ చేయనున్నారు. కావున రైతులందరూ మీ గ్రామపంచాయతీ నందు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల ప్రజా ప్రతినిధులను, పార్టీ పెద్దలను,రైతులను కౌలు రైతులను పాల్గొనవలసిందిగా వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.బ్రోమోడైలిన్ విషపు ఎరను తయారు చేయుట 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల విషపు ఎర మందు,రెండు గ్రాముల నూనె కలిపి పట్టించి 100 గ్రాముల విషపు ఎర తయారు చేసుకొనీ 10 గ్రాముల చొప్పున పేపర్ పొట్లం కట్టి ఎలుక తెరిచి ఉన్న బొరియలు వద్ద పెట్టినట్లయితే సామూహికంగా ఎలుకల నిర్మూలన చేయవచ్చని తెలిపారు.

## 15న చిన్న వెంకన్న క్షేత్రంలో శ్రీకృష్ణ జయంతి

**– ఆర్జిత సేవలు రద్దు – 16న ఉట్టి పండుగ గ్రామోత్సవం**



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్**: చిన్న వెంకన్న ఆలయంలో ఈనెల 15న శ్రీకృష్ణ జయంతి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవోఎన్‌వి సత్యనారాయణ మూర్తి తెలిపారు. అష్టమి మిగులు తిదితో పాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని జరిగే ఈ ఉత్సవ నేపథ్యంలో శ్రీవారికి నిత్యం నిర్వహించే బాధ్యత కళ్యాణము నిత్యార్జిత సేవలను ఆరోజు రద్దు చేయిస్తున్నట్లు ఈవో ఓ ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు 16న సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్టి పండుగ గ్రామోత్సవం జరుగు తాయని భక్తులు పాల్గొనాలని కోరారు.

# ప్రధాని మోడీ ,ఆర్థిక మంత్రి నిర్మల చిత్ర పటాలకు పాలాభిషేకం



**భీమవరం,మేజర్ న్యూస్** : ఎర్రకోట బురుజు మీద స్వాతంత్ర్య దినోత్సవం రోజున మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, సామాన్య ప్రజలకు, మధ్యతరగతి వారికి, రైతులకు,యువతకు, మహిళలకు అందుబాటులో ఉండేలా జీఎస్టీని సంస్కరణలు తెచ్చినందుకు బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా వర్మ కల్లూరి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మా వర్మ కల్లూరి మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, సామాన్య ప్రజల జీవితాలను కూడా సులభతరం చేస్తాయని, భారీగా తగ్గించిన జిఎస్టి వల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఆమె తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సామాన్యుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి,జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట గంగ రాజు,వినోద్ వర్మ,దత్తు ప్రసాద్,ఇంజేటి వెంకటేశ్వర్లు,నాని తాతాజీ,రైతు సురేంద్ర,కోరా రామ మూర్తి,కాకినాడ ఇన్చార్జి రావూరి సుధా,ఈతకొట్ట తాతాజీ, మైనార్టీ మోర్చా రాజు గోవర్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపార్వతి,బుంగ బుజ్జమ్మ, జిల్లా కార్యదర్శి కిర్లంపూడి రమాదేవి, దుర్గ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతానికి గురై యువకుడు మృతి



చాట్రాయి,మేజర్‌న్యూస్ : చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామానికి కిరణ్ అనే యువకుడు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ పంచాయతీ లైట్లు బిగిస్తూ ఉండగా విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. ఆయన తో పాటు ఉన్న మరో ఇద్దరు కూడా విద్యుత్ ఘాతానికి గురై గాయాల పాలయ్యారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు అందవలసి ఉంది.

# మాజీ మంత్రి కారుమూరి వెంటనే క్షమాపణ చెప్పాలి



**ఇరగవరం మేజర్ న్యూస్** : ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధకృష్ణ అవినీతిపరుడని వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెంటనే క్షమాపణ చెప్పాలని ఇరగవరం మండల టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు,సాక రామాంజనేయులు డిమాండ్ చేశారు. గత వైసీపీ హయాంలో గ్రామ గ్రామాల్లోకి గ్రూప్ రాజకీయాలు చేసి కులాల మధ్య ఘర్షణలు చేయించిన ఘన చరిత్ర కలిగిన కారుమూరి టీడీపీని విమర్శించడం మీ దిగజారుడుకు నిదర్శనమన్నారు. తూర్పు విప్పర్రు గ్రామంలో డ్రైనేజి నిర్మాణానికి మట్టి త్రవ్వి ఆ మట్టిని ఇతర ప్రాంతాలకు అమ్ముకున్న జ్ఞాపకాలను మర్చిపోయి టీడీపీ పై బురదజాల్లడం పద్ధతి కాదని హితవు చెప్పారు.గ్రామాల అభివృద్ధి గాలికి వదిలి పనికిమాలిన పరిపాలన చేసిన ఘనత వైసీపీ దే అన్నారు.ప్రజలను మభ్యపెట్టాడానికి ఎక్కడికక్కడశంకుస్థాపనలు చేసి వదిలేస్తే వాటిని పూర్తి చేసిన ఘనత టీడీపీ దే అన్నారు.ఎటువంటి వ్యాఖ్యలుచేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకుంటే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలిసి వస్తుందని పేర్కొన్నారు.

# ఆర్ ఐ గా సురేఖ మంగ ప్రియ



**నరసాపురం,మేజర్ న్యూస్**: స్థానిక రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేయుచున్న సురేఖమంగప్రియ రెవెన్యూ ఇన్స్పెక్టర్గా పదోన్నతి పొందారు. గురువారం మండల రెవెన్యూ వారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తాసిల్దార్ ఐ వి వి సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్, కిషోర్, మహేష్ కార్యాలయ సిబ్బంది సురేఖకు స్వాగతం పలికారు.

# పద్మశ్రీ సర్విశెట్టి 119 వ జయంతి





**నర్సాపురం, మేజర్ న్యూస్** : హెచ్‌ఎస్‌పివిఎస్ సంఘం అనుబంధ సంస్థల వ్యవస్థాపకులు పద్మశ్రీ అద్దేపల్లి సర్వి చెట్టి 119 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ నూలి శ్రీనివాస్ ట్రెజరర్ టి.వీరభద్రం కాలేజ్ స్టాఫ్,స్టూడెంట్స్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ కి ,స్టాఫ్ కి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నీరజ,లెక్చరర్స్ రాధ, రోజా, మాధురి , సునీత తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూ గత 81 రోజులుగా సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న సిబ్బంది కూడా కళాశాల గేటు ముందు సర్విశెట్టి జయంతి నిర్వహించారు.

ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కోట్ల రాంకుమార్, బహుజన కులాల రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి గురు ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# మహిళల స్వయం ఉపాధి లక్ష్యం





**– హెూప్స్ మినిస్ట్రీస్‌చే కుట్టు మిషన్‌లు పంపిణీ**

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్** : మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో కుట్టు మిషన్లు సబ్సిడీపై అందిస్తున్నట్లు హెూప్స్ మినిస్ట్రీస్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. జీలుగుమిల్లిలోని రామన్నపాలెం కాలనీ అంబేద్కర్ యూత్ సహకారంతో 60 మంది మహిళలకు కుట్టు మిషన్ ల పంపిణీ చేశారు. మహిళలకు రూ. 3,600 సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా హెూప్ మినిస్ట్రీస్ అధినేత గడ్డం సామ్యూల్ జాషువా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని సంకల్పంతోనే కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళల జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ధారా మనోజ్ మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్ల ద్వారా మహిళలు తమ కుటుంబాలకు అండగా నిలబడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెూప్స్ మినిస్ట్రీస్ సంస్థ ప్రతినిధి బాలాజీ హాజరై మహిళలను అభినందించారు.సబ్సిడీపై కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు హెూప్ మినిస్ట్రీస్ మరియు అంబేద్కర్ యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్, సెక్రటరీ మాధవ్, రాజేష్, జనార్ధన్, బొంతు రామకృష్ణ, దాసరి అనిల్, బి.వి రామారావు, సంతోష్, సిహెచ్ అంజిత్, యూత్ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్** : స్వామి వివేకానంద జీవితం సందేశాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు వేదుల జనార్ధన్ రావు పేర్కొన్నారు. భారతదేశ ఔన్నత్యం దేశ సంస్కృతి, దేశ పరమ వైభవ స్థితిని, ఈ దేశ శాస్త్రీయ సాంకేతికను చికాగోలో 1893 సెప్టెంబర్ 11న జరిగిన ప్రపంచ సర్వమత మహాసభలలో యుగద్రష్ట స్వామి వివేకానంద ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని ఉపాధ్యాయులు వేదుల జనార్ధన రావు పేర్కొన్నారు.

స్వామి వివేకానందుని జీవితం, సందేశాలు నేటి తరానికి, విద్యార్థులకు స్ఫూర్తిదాయకాలని అన్నారు. గురువారం వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల నందు చికాగో లో జరిగిన సర్వమత మహాసభలలో ప్రసంగించి,ఈ ఏటికి 132 సంవత్సరాలు అయిన సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు ఎం వి ఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పాఠశాల ఉపాధ్యాయులు ఉర్రింకల శివశంకర్ పుష్పమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యు శివ శంకర్,కే గౌరీ శ్రీ, వి కామేశ్వరి, వెల్ల మనోహర్ రెడ్డి, పి అమల విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశం నాయకునికి నివాళులర్పించిన నేతలు



**నరసాపురం రూరల్, మేజర్‌న్యూస్** : మండలంలోని దర్భరేవు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లాడి పెద్దిరాజు మరణించారు. గురువారం ఆయన పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి ఘన నివాళులు అర్పించారు.పెద్దిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్, మాజీ ఏఎంసి చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, కోరిపల్లి వాసు, సజ్జా వాసు, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ సభ సూపర్ హిట్

**– టిడిపి మహిళా అధ్యక్షురాలు భూపతి రాజు రాధ దేవి**



**పెనుమంట్ర, మేజర్ న్యూస్** : అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్, సూపర్ హిట్ సభ జన సందోహంతో విజయవంతం అవడం జరిగింది అని ఆ సభ చూసి ప్రత్యర్థి పార్టీ వాళ్ళ గుండెల్లో రైలు పరిగెడుతున్నాయని, సూపర్ సిక్స్, సూపర్ హిట్ సభ నుండి ఆటో డ్రైవర్ లకు విజయదశమి రోజున 15 వేల రూపాయలు వారి ఎకౌంట్లో జమ చేయడం జరుగుతుందని ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి, కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ కి, జిల్లా ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కి, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజుకి,ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణకి,జిల్లా శాసన సభ్యులకు, శాసనమండలి సభ్యులకు, కార్పొరేషన్ చైర్మన్‌లకు, డైరెక్టర్లకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు,పెనుమంట్ర మండల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు భూపతి రాజు రాధ దేవి కృతజ్ఞతలు తెలియజేశారు,ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తానని మాట ఇచ్చిన ప్రకారం స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగిందని, అన్నారు.ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మరణించిన పెనుమంట్ర మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగిపూడి సరోజినీ కుటుంబ సభ్యులను పరామర్శించి, తెలుగుదేశం పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని పెనుమంట్ర మండల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు భూపతి రాజు రాధ దేవి తెలియజేసారు.

## పాము కాటుకు గురై వ్యక్తి మృతి



**లింగపాలెం, మేజర్‌న్యూస్** : లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సరిపల్లి ఏసు పాదం (48) అనే వ్యక్తి పాము కాటుకు గురై మరణించాడు. ఆయన కూలి పనులు చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. గురువారం అదే గ్రామంలో పామాయిల్ తోటలో పామాయిల్ గెలలు కోస్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతని మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

## రైలు నుండి జారిపడి వృద్ధుడు మృతి



**ఏలూరు / కాకినాడ,మేజర్ న్యూస్** : కాకినాడకు చెందినకోటి సూర్య నారాయణ (80)అనే వృద్ధుడు ఏలూరులో తన సోదరుడు చనిపోయాడని తెలిసి చూసేందుకు కాకినాడ నుండి రైలులో ఏలూరుకు బయలుదేరాడు. ఆశ్రం ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి రైలు నుండి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు.


రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. రైల్వే హెచ్‌సి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 26 నుండి ఏలూరులో అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

**ఏలూరు,మేజర్ న్యూస్**: రాష్ట్ర స్థాయిలో అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఈనెల 26వ తేదీ నుండి 29 వరకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 2500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు మన ఏలూరులో జరగడం మన జిల్లాకు గర్వకారణమన్నారు. ఛాంపియన్‌షిప్ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా సహకరించాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## ఫైర్ స్టేషన్ ఏర్పాటు స్థల పరిశీలన



**నరసాపురం,మేజర్ న్యూస్** : మునిసిపల్ ఆవరణలో ఉన్నటు వంటి ఫైర్ స్టేషన్ శిధిలావస్థలో ఉన్నందున 2వ వార్డు కుళాయి చెరువు దగ్గర గల 20 సెంట్లు స్థల సేకరణకై గురువారం మునిసిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ, కమీషనర్ ఎమ్. అంజయ్య,మేనేజర్ గుణ్ణం మురళీధర్ , టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎమ్. వెంకట రమణ పరిశీలన చేశారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ

**– అధికారులకు జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం**



**భీమవరం,మేజర్ న్యూస్:** కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా శాఖలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో గురువారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ మొదటి వారం నుండి రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని బ్యాగులు, ఆర్ఎస్కే లలో సిబ్బంది నియమించి వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. అక్టోబర్ మొదటి వారంలో తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు, క్విక్ రెస్పాన్స్ టీమ్ను నియమించడం జరుగుతుందన్నారు. ఈ టీంలో తహసిల్దార్, మండల వ్యవసాయ శాఖ అధికారి, టెక్నికల్ అసిస్టెంట్ ఉంటారన్నారు. ప్రతి ఆర్ ఎస్ కేలో మొదటి విడతగా రైస్ మిల్లర్స్ ద్వారా 33శాతం గోని సంచులు సిద్ధం చేయాలని జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని రవాణా శాఖ అధికారిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి ఎంవీ కృష్ణారావు, డీఎస్ఓ ఎన్.సరోజ, సివిల్ సప్లయ్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, ఏ ఎస్ ఓ ఎం.రవి శంకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి రామరాజు, కార్యదర్శి కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు మంత్రి నారా లోకేష్

**– నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించడం అసాధారణమైన చర్య**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** నేపాల్‌లో జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు టిడిపి యువనేత, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ స్పందించిన తీరు తవలాంటి వారందరికీ ఆదర్శప్రాయమనీ ఎమ్మెల్యే బడేటి చంటి ప్రశంసించారు. అసలు సిసలైన భాషాభిమానం, ప్రాంతీయాభిమానం ఉన్న పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీయేనని ఆయన స్పష్టం చేశారు. ఇదేఅంశంపై గురువారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడిన ఆయన నేపాల్ మారణహోమంలో తెలుగువారు కూడా చిక్కుకున్నారన్న విషయం తెలియగానే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ హుటాహుటిన స్పందించారన్నారు. కేవలం స్పందించడంతోనే చేతులు దులుపుకోకుండా కేంద్రంతో సంప్రదింపులు జరిపి, వారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చే బాధ్యతను అత్యంత సమర్థవంతంగా చేపట్టారనీ చెప్పారు. అత్యంత ముఖ్యమైన అనంతపురం పర్యటనను కూడా రద్దు చేసుకునీ, హుటాహుటిన సచివాలయానికి చేరుకున్న నారా లోకేష్ రియల్ గవర్నెన్స్ సెంటర్ వార్‌రూమ్‌నే కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చీ, సహాయ చర్యలు వేగవంతంగా జరిగేలా దృష్టిసారించారని కొనియాడారు. సుమారు 215 మంది తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చడంతో ఆయన కీలకపాత్ర పోషించారనీ ప్రశంసించారు. అసలు ఈ అంశంలో ఏమీ పట్టనట్టు కూర్చున్న మాజీ సీఎం జగన్ రెడ్డి,,, కేవలం రాజకీయ పబ్బం గడుపుకునేందుకే కూటమి ప్రభుత్వంపై అడ్డదిడ్డమైన వ్యాఖ్యలు చేస్తున్నారనీ దుయ్యబట్టారు. సుపరిపాలన ఎలాచేయాలో, ప్రజలు అనుకోని ఆపదల్లో చిక్కుకుంటే ఎలా స్పందించీ, రక్షించాలో నారా లోకేష్‌ను చూసి జగన్‌రెడ్డి నేర్చుకోవాలనీ ఎమ్మెల్యే చంటి హితవు పలికారు.

# 16న మండల సర్వసభ్య సమావేశం : ఎంపీడీఓ జ్యోతి

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** ఈనెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కుంజా జ్యోతి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ సమావేశానికి మండల అధికారులు ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈనెల రెండవ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరగవలసి ఉండగా 1/3 వ వంతు సభ్యులు లేకపోవడంతో కోరం లేనందున సమావేశం వాయిదా వేసినట్లు తెలియజేశారు.ఇప్పుడు నిర్వహించబోయే సమావేశానికి ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరయితే చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్‌కి నివేదిక పంపిస్తామని ఆమె పేర్కొన్నారు.

# విద్యావంతులు అవ్వాలంటే ఉత్తమ ఉపాధ్యాయులు ఉండాలి





**ఇరగవరం మేజర్ న్యూస్ :** దేశం అభివృద్ధి చెందాలంటే విద్యావంతులు ఉండాలి విద్యావంతులు అవ్వాలంటే ఉత్తమ ఉపాధ్యాయులు ఉండాలని కంతేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు ఘంటా శ్రీనివాసరావు అన్నారు.గురువారం కంతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రేణుక ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడం వలన విద్యార్థుల భవిష్యత్ బాగుండటమే కాకుండా ఆ ఫ్యామిలీ ఉన్నత స్థానంలో ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో పాఠశాలకు విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రి అందిస్తూ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న సొసైటీ అధ్యక్షులు ఘంటా శ్రీనివాసరావును అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంతేరు సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ వీరెడ్డి,సబ్బితి బుషి,ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ కవితా పోటీలలో విజేత డా.బాలచందర్



పెనుగొండ,మేజర్ న్యూస్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన జాతీయ కవితా పోటీలలో పెనుగొండకు చెందిన కవి, రచయిత డాక్టర్ బాలచందర్ పాల్గొని విజేతగా నిలిచారు.బాలచందర్ టాప్ టెన్ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్కెపి కళాశాలల ప్రెసిడెంట్ తాడి నాగిరెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# 88 మందికి సిఎం సహాయ నిధి రూ.48,11,983 చెక్కులు పంపిణీ



**పోడూరు, మేజర్ న్యూస్ :** ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖ దిగువనున్న పేద వర్గాలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 88 మంది బాధితులకు మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రూ.48,11,983 నగదు విలువ గల చెక్కులను అందజేశారు. కొమ్ముచిక్కాలఆఫీసు కార్యాలయంలో ఆయన గురువారం అంద జేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి మండల, గ్రామ అధ్యక్షులు ,ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చివరి రైతు వరకు ఎరువులు అందాలి

**– జిల్లాలో ఎరువుల సరఫరా,పంపిణీలపై జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో చివరి రైతు వరకు ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని జిల్లా కె. వెట్రిసెల్వి వ్యవసాయాధికారులు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి గురువారం సాయంత్రం జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీ పై వ్యవసాయాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 78 వేల 624 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ నెల 12వ తేదీన సుమారు 600 మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా జిల్లాకు రానున్నదన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2063 మెట్రిక్ టన్నుల యూరియా, 2897 మెట్రిక్ టన్నుల డి.ఏ.పి., 4315 మెట్రిక్ టన్నుల ఎం ఓ పి, 12 వేల 831 మెట్రిక్ టన్నుల ఎన్.పి.కె., 662 మెట్రిక్ టన్నుల ఎస్ ఎస్ పి . మొత్తం కలిపి 27 వేల 6656 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల పంపిణీలో ఎటువంటి సమస్య కలగకుండా చూడాలని, ఎరువుల నిల్వలు తక్కువగా ఉన్న సొసైటీలకు ఎరువులను వెంటనే సరఫరా చేయాలన్నారు. రాబోయే వారానికి అవసరమైన ఎరువుల అవసరాలను శుక్రవారం సాయంత్రానికి తెలియజేయాలన్నారు.



అత్యవసరంగా ఎరువులు అవసరమైతే సంబంధిత వివరాలు వ్యవసాయ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ వారికి తెలియజేసి పొందాలన్నారు. పంటల వారీగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో ఉండడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

## కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య



**భీమడోలు,మేజర్ న్యూస్ :** కడుపునొప్పి భరించలేక మహిళ ఉరివేసుకుని గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. భీమడోలు మండలం అజ్జావారిగూడెం గ్రామానికి గురజాల మంగమ్మ (50)గా మృతురాలిని గుర్తించారు. ఈమె భర్త చనిపోయి ఐదేళ్లు అవుతుండగా ముగ్గురు వీరికి సంతానం.ముగ్గురు పిల్లలకు వివాహాలు జరిగాయి. ప్రస్తుతం ఈమె కూలి పనులు చేస్తూ తన చిన్న కుమారుడు కుటుంబంతో కలిసి జీవిస్తుంది.

# గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు

– రోజుకు 5 గంటల నుండి 7 గంటలు విద్యుత్ కోత

– రాత్రుల్లో జాగారమేనంటూ ప్రజల ఆందోళన



**పెనుమంట్ర, మేజర్ న్యూస్:** పెనుమంట్ర మండలంలోని పలు గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు విద్యుత్ వినియోగదారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పగలు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, రాత్రి వేళల్లో ఉక్క పోత కారణంగా కరెంటు కోత తోడు కావడంతో వృద్ధులు చిన్నారులు పలు వ్యాధులతో బాధపడుతున్న వాళ్ళు నానా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రజా ప్రతినిధులు మండల పరిషత్ సమావేశంలో హెచ్చరించినప్పటికీ అధికారుల తీరులో మాత్రం ఎటువంటి మార్పు కనపడటం లేదని వినియోగ దారులు వాపో తున్నారు. ఇలా ఉంటే గడచిన మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటలకు కరెంటు కోత విధించి తిరిగి 11:45 విద్యుత్ను సరఫరా చేశారు. మళ్లీ లైన్లు తెగిపోయాయంటూ కరెంటు కోత విధించి తెల్లవారుజాము నాలుగు గంటలకు సరఫరా చేశారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మారిన అధికారుల పనితీరులో మార్పు రాలేదని మండిపడుతున్నారు. గంటల తరబడి విద్యుత్ కోతలకు కారణం ఏమి కావచ్చు సమస్య ఏర్పడితే ఆ సమస్య పరిష్కరించడానికి గంటల తరబడి సమయం పట్టడానికి ప్రధాన కారణం నియోజకవర్గంలోని పెనుమంట్ర పెనుగొండ ఆచంట మండలాల సబ్ ఇంజనీర్లు ఇన్చార్జిలు కావడమేనని ఉంటున్నారు. వీరి కింద పనిచేసే లైన్ ఇన్స్పెక్టర్లు లైన్లు పునరుద్ధరించాలంటే తణుకు, పెరవలి,తిల్ల పూడి గ్రామాల్లో నివాసముంటూ స్థానిక మండలాల్లో పనిచేస్తున్నారు. సమస్య ఏర్పడిన తర్వాత బయలుదేరి రావడానికి కొంత సమయం, పని పూర్తి చేయడానికి మరికొంత సమయం పడుతుందని దీంతో విద్యుత్ వినియోగదారులు అకచాట్లు తప్పడం లేదని అంటున్నారు.

## మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు





**కైకలూరు, మేజర్ న్యూస్,** మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ నేత్ర ఆసుపత్రి నిపుణుల సహకారంతో కైకలూరు ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం.ఎన్.ఎస్ ఎస్ యూనిట్ సంయుక్తంగా ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శ్రీలత ప్రారంభించి కంటి ఆరోగ్య ప్రాముఖ్యత మొబైల్ ఫోన్ అధికంగా వాడకం వల్ల కలిగే వ్యాధులు మరియు వాటి ప్రభావం గురించి వివరించారు. వి.సంధ్య మాట్లాడుతూ కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సులభంగా పరిష్కరించుకోవచ్చని, నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు .ఎం.విజయ కుమార్ ఈ శిబిరాన్ని సమన్వయం చేసి కంటి చూపు ప్రాధాన్యం, మరణానంతరం కంటి దానం వల్ల కలిగే మహత్తరమైన సేవ గురించి విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎస్ మాధవి ఆనంద పాల్గొని కంటి పరీక్షల ప్రాముఖ్యత, క్రమం తప్పకుండా కంటి ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు.ఈ శిబిరంలో 130 మంది విద్యార్థులు 25 మంది అధ్యాపకులు కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 35 మందికి కంటి అద్దాలు వినియోగించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించగా విద్యార్థులు, అధ్యాపకులు వైద్య బృందం సమయుక్త కృషిని పలువురు అభినందించారు.

## మానవత ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామం లో స్థానిక సొసైటీ బిల్డింగ్ వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిడదవోలు శ్రీ రాజేశ్వరి కంటి వైద్యశాల పరీక్షలు నిర్వహించారు. 145 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 45 మందికి ఉచితంగా కళ్ళ జోళ్ళు ఇచ్చారు. 15 మందికి ఉచితం కంటి ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు కంటి ఆసుపత్రికి తీసుకు వెళ్లినారు. ఆరుగొలను సొసైటీ ఛైర్మెన్ ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ ఆర్థిక సహకారం జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ మానవతా సంస్థ చేసే ఈ మంచి కార్యక్రమం వల్ల గ్రామాలలో ఉన్న వృదులకు, పేదవారికి చాల బాగా ఉపయోగ పడుతుందని అన్నారు. ఉప్పల పాటి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ నేను పుట్టిన ఈ గ్రామంలో ఈ వైద్య శిబిరం పెట్టడం తనకు చాల సంతోషంగా ఉందని దీనికి మానవతా వారి సహకారం మరువ లేనిదాని అన్నారు. మానవతా ఛైర్మెన్ పైడికొండల సింధు మాట్లాడుతూ వివిధ రంగాలలో మానవతా చేస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమం లో మానవత అధ్యక్షులు జినపనేని రాజేంద్ర కుమార్, సెక్రటరీ మిరియాల కిశోర్, ట్రజరర్ ఎర్ర ఆంజనేయులు, యెగ్గిన శరత్ బాబు, చేకూరి బంగార్రాజు, బురిడి సతీష్, బి హరి కుమార్ గారు, రామారావు, ఎల్ఐసి పాండురంగ రావు, బి అరుణ, జక్కిలింకి రామ కృష్ణ, ఆరుగొలను సొసిటీ డైరెక్టర్స్ మద్దిశెట్టి సూర్యనారాయణ, మైనం శ్రీనివాస సొసిటీ సిబ్బంది స్థానిక పెద్దలు తది తరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రిని కలుసుకున్న బిజెపి నేతలు



**తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్ :** తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లో గురువారం ఉదయం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్వర్మకి నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ ఈతకోట భీమా శంకరరావు(తాతాజీ) ఘనస్వాగతం పలికారు. బిజెపి శ్రేణులు పుష్పగుచ్ఛం ఇచ్చిస్వాగతంపలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, సీనియర్ నాయకులు కర్రి ప్రభాకర్ బాలాజీ, మాణిక్యాలరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట రాంబాబు, నరసాపురం మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు సమయమంతుల కాశీవిశ్వేశ్వరరావు, సీనియర్ నాయకులు ముప్పిడి సురేష్ రెడ్డి, పచ్చ రామకృష్ణ, పసుపులేటి అమ్మిరాజు, పట్టణ జనరల్ సెక్రెటరీ చిట్యాల రాంబాబు, గారగా ప్రసాద్ మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేకేరులో పొలం బడి కార్యక్రమం



**ఇరగవరం,మేజర్ న్యూస్ :** మండలంలోని పేకేరు లో పొలం బడి కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ ధికారి వై.రాఘ వేంద్ర రావు చెప్పారు.పొలంలో అధిక పురుగు మందులు వాడకూడదని చెప్పారు. దీనివలన మనం తినే ఆహారంలో పురుగు మందుల అవశేషాలు ఉంటున్నాయని చెప్పారు.పొలాల్లో పంటను నాశనం చేసే కీటకాలతో పాటు పంటకు మేలు చేసే కీటకాలు చనిపోతాయని చెప్పారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.శేష సాయి,జి. సెహవంత్,బి.ధనరాజు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలమూరు ఉపాధ్యాయిని శోభారాణికి జిల్లా ఉత్తమ టీచర్ అవార్డు



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** అన్ని వృత్తుల్లో ఉత్తమ మైన వృత్తి అయిన ఉపాధ్యాయ వృత్తి లో అవార్డు పొందడం టీచర్స్ కు వరం అని పలువురు వక్తలు అన్నారు. గురువారం మండలం లోని ఆలమూరు మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని యాళ్ళ శోభారాణికి జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భంగా గ్రామం,పాఠశాల, ఎస్ఎంసి తరుపున ఘనంగా శోభారాణి దంపతులకి అభినందన సన్మానం చేశారు.

ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు కర్రి అయ్యప్ప రెడ్డి, తేతలి రామా రెడ్డి, ఎల్.ఎఫ్.ఎల్. ఉపాధ్యాయులు, జాతీయ అవార్డు గ్రహీత కే.ఎన్.వి. శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు కడలి సత్యనారాయణ, భువనేశ్వరి, స్థానిక ఉపాధ్యాయులు ఎన్. సత్యనారాయణ రాజు, చింతపల్లి నాగ ప్రియ, శ్రీనివాసుల రామకృష్ణ, పాస్టర్ పి. ప్రేమ్ కుమార్,తదితరులు ప్రసంగించారు. సభ ను విశ్రాంత హెచ్. ఎం., జర్నలిస్ట్ ఎన్.కే. నాగేశ్వరరావు నడిపించారు.పాఠశాల ప్రాంతం లోని స్థానిక ప్రజలు, తల్లి దండ్రులు, ఎస్.ఎం.సి., పి.ఎం.సి. సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : ఎంపీపీ సోనీ



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. గురువారం మండలంలోని మల్లవరం గ్రామంలో పులకండం వెంకట్రావు రైస్ మిల్లు దగ్గర జరిగిన వైసీపీ కమిటీ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం వైసీపీ నాయకులు, కార్యకర్తలపై వ్యూహాత్మకంగా దాడులు చేయటంతో పాటు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పాలక మండలి సభ్యులు పిడి రాజు, వైసీపీ మండల కమిటీ అధ్యక్షులు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్న పూర్తి అవుతున్నదని, ఆర్భాటం తప్ప ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఏమీ లేవని విమర్శించారు. యూరియా అందుబాటులో లేకుండా రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారన్నారు. గతంలో పేదలు, మధ్యతరగతి ప్రజల కోసం వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఏమి ఈ రాష్ట్రంలో అమలు జరగడం లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత వైసీపీ కార్యకర్తలపై ఉన్నదని వారన్నారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షులుగా పులకండం మాధవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి గోపీనాథ్, ఇంజేటి జాన్ కెనడి, తదితరులు మాట్లాడారు.